నేడు తుది విడత పోరు

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- 3,752 సర్పంచ్ స్థానాలకు... బరిలో12,652 మంది
- 28,410 వార్డు స్థానాలకు 75,725 మంది పోటీ
- వంద శాతం పోలింగ్ స్లిప్పుల పంపిణీ
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు
- తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా తుది విడతలో 182 మండలాల్లోని 3,752 పంచాయతీల్లో జరగనున్న సర్పంచ్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సర్పంచ్ స్థానాలకు 12,652 మంది, వార్డు స్థానాలకు 75,725 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, ఆ తర్వాత మధ్యాహ్నం 2గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందన్నారు. 31 జిల్లాల్లో 36,483 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 53,06,401 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 26,01,861 మంది పురుష ఓటర్లు, 27,04,394 మంది మహిళా ఓటర్లు, 140 మంది ఇతరులు ఉన్నారని వివరించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు 4,502 మంది రిటర్నింగ్ అధికారులను, 77,618 మంది ఇతర సిబ్బందిని నియమించినట్టు వివరించారు. మూడు విడతలకు కలిపి మొత్తం 2,489 మైక్రో అబ్జర్వర్లను నియమించినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. బుధవారం సాయంత్రం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తామని, వీలు కాకుంటే గురువారం పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్ల నియామకం జరిగిందని తెలిపారు. ఓటు వేసే వారు తమ ఎలక్షన్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర 18 రకాల ఐడి కార్డులను అనుమతించినట్టు ఎన్నికల సంఘం పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా చివరి విడతలో 3,547 పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు వెబ్ కాస్టింగ్ లాగిన్ పాస్‌వర్డ్ ఎన్నికల సంఘం ఇచ్చింది. పోలింగ్, ఇబ్బందులు, ఇతర శాంతి భద్రతల సమస్య తలెత్తినపుడు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకుంటారు. నెట్ సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లో లోకల్ వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికల కోడ్ అమలైనప్పటినుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.9,11,34,563 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎన్నికల సంఘం తెలిపింది. రూ.2,28,32,539 విలువైన మత్తు పదార్థాలు, రూ.3,81,63,154 విలువైన మద్యం సీజ్ చేశామని పేర్కొంది. 12,20,500 విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.78,33,840 విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు 36,165 మందిని బైండోవర్ చేసినట్టు పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రత ఏర్పాటు చేసినట్టు ఎన్నికల సంఘం వివరించింది. గ్రామాల అభివృద్ధి కోసం ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లందరూ పోలింగ్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది. అలాగే ఫిర్యాదుల కోసం 92400212456 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు.

రెండో విడత పోలింగ్ వివరాలు

జిల్లాలు : 31,మండలాలు : 182
పంచాయతీలు : 3,757,పోటీలో ఉన్న అభ్యర్థులు: 12,652
వార్డులు : 28,410, పోటీలో ఉన్న అభ్యర్థులు:75,725
ఓటర్లు : 53,06,401. మహిళలు : 27,04,394
పురుషులు: 26,01,861,ఇతరులు : 140
పోలింగ్ స్టేషన్లు : 36,483

ఉపాధి హామీ చట్టంపై కేంద్రం కుట్ర

- నిర్వీర్యానికే కొత్త పథకం
- మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ ఉపాధి హామీ హామీ చట్టం పేరు మార్చి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి ఉరితాడు వేసేటున్నారని వ్యాఖ్యానించారు. ఉపాధి హామీ చట్టంలో మీరు తెస్తున్న సంస్కరణలు గొప్పవైతే రాష్ట్ర ప్రభుత్వాలతో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. పార్లమెంటులో హడావిడిగా బిల్లు తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందని విమర్శించారు. తక్షణమే బిల్లు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధి హామీకి కుంటిసాకులు చెబుతూ నిధుల్లో కోతలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. పేరు మార్చి జాతిపిత గాంధీని అవమానిస్తున్నారని నిరసించారు. ఇప్పటికే మీకు గాడ్సే వారసులుగా పేరు ఉందని గుర్తు చేశారు. కరోనా సమయంలో దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టం పేదలకు ఉపాధి కల్పించిన విషయం మరిచిపోయారా ? అని అడిగారు. ఉపాధి హామీ కాంగ్రెస్ పార్టీ బ్రెయిన్ చైల్డ్ కాబట్టే దానిని చంపే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఒక చట్టాన్ని మారుస్తున్నప్పుడు రాష్ట్రాలతో చర్చించాలి కదా ? వారి అభిప్రాయాలు తీసుకోవాలి కదా? అని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

స్నేహ భావంతో క్రీడల్లో పాల్గొనాలి

- డిజిపి శివధర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్నేహ భావంతో క్రీడల్లో పాల్గొనాలని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి సూచించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మౌలాలిలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు సహకారంతో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 26వ ఆలిండియా పోలీస్ బ్యాండ్ పోటీలను మంగళవారం డిజిపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇది సరిహద్దులను దాటి దేశభక్తి, కర్తవ్య భావన పంచుకున్న విలువలను ప్రతిబింబిస్తుందన్నారు. అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీ లక్ష్యం పోలీస్ సంస్థలలో సంగీత సంస్కృతిని ప్రోత్సహించడం, సంగీతం అనే సార్వత్రిక భాష ద్వారా దళాల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడమని చెప్పారు. క్రీడా స్ఫూర్తితో ఈ పోటీల్లో పాల్గొంటున్న వారిని అభినందించారు. మొత్తం పోటీల్లో ఆంధ్రప్రదేశ్, అస్సాం పోలీస్, అస్సాం రైఫిల్స్, బీహార్, బిఎస్ఎఫ్, ఛత్తీస్‌గఢ్, సిఐఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఐటిబిపి, జమ్మూ అండ్ కాశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, పంజాబ్, రాజస్థాన్, ఆర్‌పిఎఫ్, ఎస్ఎస్ఎఫ్, తమిళనాడు, తెలంగాణకు చెందిన 24 బృందాలు పాల్గొన్నాయి. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర సాయుధ పోలీస్ దళాలు, రాష్ట్ర పోలీస్ సంస్థలు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన పోలీస్ బ్యాండ్‌లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో మొత్తం 24 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి బృందాలు పాల్గొన్నాయి. 10వేల మందికి పైగా ప్రేక్షకులు ఈ అద్భుత వేడుకను తిలకించగా.. దేశం నలుమూలల నుంచి వచ్చిన 1,300 మందికి పైగా బ్యాండ్ సభ్యులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ పోటీ బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్, బ్యూగుల్ డిస్‌ప్లే వంటి విభాగాల్లో నిర్వహించారు.

రాష్ట్రమంతా అవినీతిమయం

- బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రమంతా అవినీతిమయం అయ్యిందని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే కరప్షన్, క్రైమ్‌గా మారిందని అన్నారు. పట్టపగలు నడిరోడ్డుపై హత్యలు జరుగుతున్నాయని చెప్పారు. 2023తో పోలిస్తే క్రైం రేటు 14 శాతం పెరిగిందన్నారు. ఈ ఏడాదిలో వెయ్యి హత్యలు జరిగాయని వివరించారు. శాంతిభద్రతలను చూసి పెట్టుబడిదారులు పారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. దేశంలో ఆదర్శంగా ఉన్న తెలంగాణ పోలీస్ నేడు అధ్వాన్నంగా మారిందని చెప్పారు. చలానాల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల రక్తాన్ని తాగుతున్నారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. నేరాల సంఖ్యను ప్రభుత్వం నియంత్రించకపోతే బిఆర్ఎస్ ఆందోళనా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు కె కిషోర్‌గౌడ్, ఇంతియాజ్ అహ్మద్, గోసుల శ్రీనివాస్ యాదవ్, కురువ విజయ్ కుమార్, గౌతమ్ ప్రసాద్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో క్వాంటమ్ ఎఎంసి కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్: క్వాంటమ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (క్వాంటమ్ ఎఎంసి) హైదరాబాద్‌లో తన నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా క్వాంటమ్ ఎఎంసి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీమంత్ శుక్లా మీడియా మాట్లాడుతూ.. ఇది దక్షిణాదిలో తమ ఉనికిని మరింత బలోపేతం చేసే కీలకమైన దేశంలో అత్యంత చురుకైన, అంతర్జాతీయంగా అనుసంధానమైన ప్రొఫెషనల్స్, పారిశ్రామికవేత్తల సముదాయంలో హైదరాబాద్ ఒకటన్నారు. గత మూడు నెలల్లో ఇది మా రెండో కార్యాలయం అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం తొమ్మిది కార్యాలయాలు ఉన్నాయని.. మార్చి కల్లా మరో రెండు అందుబాటులోకి రానున్నాయన్నారు. తెలంగాణాలో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని చెప్పారు. నవంబర్ 2025 నాటికి రాష్ట్రం నుంచి మ్యూచువల్ ఫండ్ సగటు ఆస్తుల నిర్వహణ విలువ (ఎఎయుఎం) సుమారు రూ.1.37 లక్షల కోట్లకు చేరిందన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం మ్యూచువల్ ఫండ్ ఎఎయుఎంలో తెలంగాణ వాటా సుమారు 2.08 శాతం అన్నారు. హైదరాబాద్ టెక్నాలజీ, ఆవిష్కరణలు, ఆర్థిక క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన నగరమని క్వాంటమ్ అడ్వైజర్స్ ఎండి, గ్రూప్ హెడ్ ఈక్విటీస్ ఐవి సుబ్రమణ్యం పేర్కొన్నారు.



ఎలక్ట్రిక్ బస్ లీజింగ్‌లోకి ఎలక్ట్రిగో

- జిఇఎంఎస్‌తో ఒప్పందం

హైదరాబాద్ : ఎలక్ట్రిక్ బస్ లీజింగ్ సొల్యూషన్‌ను ప్రారంభించినట్లు ఎలెక్ట్రిగో కో ఫౌండర్ సుధీంద్ర రెడ్డి పిడపా తెలిపారు. 50 ఎలక్ట్రిక్ బస్సుల పంపిణీ కోసం గ్రీన్ ఎనర్జీ మొబిలిటీ సొల్యూషన్స్ లిమిటెడ్‌తో ఎలక్ట్రిగో ఒప్పందం కుదుర్చుకుంది. ఫుల్ స్టాక్ ఎలక్ట్రిక్ బస్ లీజింగ్ ప్లాట్‌ఫారంగా ఉన్న ఎలెక్ట్రిగో ప్రయివేటు బస్ ఆపరేటర్లను లక్ష్యంగా చేసుకుని తన ఎలక్ట్రిక్ బస్ లీజింగ్ సేవలను మంగళవారం అధికారికంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా సుధీంద్ర రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఎలెక్ట్రిగో కీలక మార్గాల్లో 50 ఎలక్ట్రిక్ బస్సులను అమలు చేసేందుకు గ్రీన్ ఎనర్జీ మొబిలిటీ సొల్యూషన్స్ లిమిటెడ్ (జిఇఎంఎస్)తో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను దేశవ్యాప్తంగా మరింతసులభంగా,మరింత వాణిజ్యపరంగా ప్రయోజనకరంగా అందిస్తున్నామన్నారు. జిఇఎంఎస్, జీల్ మొబిలిటీ డైరెక్టర్ సునిల్ కుమార్ రవీంద్రన్ మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కులు, మైనింగ్ పరికరాలు, హై-క్యాపాసిటీ ఛార్జింగ్ సామర్థ్యాలను కలిపి, పైలట్లకే పరిమితం కాకుండా వాస్తవ ప్రాజెక్టుల అమలుపై దృష్టి పెట్టామన్నారు. ఆర్థిక సంవత్సరం 2026-27 నాటికి 200 బస్సులు, 150 ట్రక్కులు, 50 మైనింగ్ మెషీన్లకు విస్తరించాలనే స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో పని చేస్తున్నామన్నారు.

సింగరేణి సిఎమ్‌డిగా కృష్ణభాస్కర్

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి ఇన్‌చార్జి సిఎమ్‌డిగా తెలంగాణ ట్రాన్స్‌కో చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న సీనియర్ ఐఎఎస్ అధికారి డి.కృష్ణభాస్కర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత సిఎమ్‌డి ఎన్.బలరామ్ డిప్యూటేషన్ పూర్తి కావడంతో ఆయన కేంద్ర సర్వీసులోకి వెళ్లారు. కేంద్ర రెవెన్యూ సర్వీసుల నుంచి డిప్యూటేషన్‌పై రాష్ట్రానికి వచ్చిన బలరామ్ సింగరేణిలో చైర్మెన్‌గా, సిఎమ్‌డిగా ఆరేళ్ల పాటు పని చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చిన అధికారులకు డిప్యూటేషన్ గడువు సాధారణంగా ఐదేండ్లే ఉంటుంది. అంతకు మించి ఏడాది అదనంగా ఉన్నందున మరోసారి బలరామ్ గడువు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరలేదు. కృష్ణ బాస్కర్ స్థానంలో పూర్తి స్థాయి అధికారిని త్వరలో నియమించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి సిఎం స్థాయిలో నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. కాగా మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ప్రస్తుత చైర్మెన్ ఎన్.బలరామ్ నుంచి కృష్ణభాస్కర్ బాధ్యతలు స్వీకరించారు.

కార్మికుల సహకారం మరవలేనిది: ఎన్ బలరామ్

కార్మికుల సహకారం మరువలేనిదని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. బదిలీపై కేంద్ర సర్వీసులకు వెళుతున్న సందర్భంగా ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆరేళ్లుగా సింగరేణి విస్తరణ, కార్మికుల సంక్షేమం, అభివృద్ధిని చిత్తశుద్ధితో అమలు చేశాను. మూడు దశాబ్దాలుగా బొగ్గు ఉత్పత్తి సంస్థగానే ఉన్న సిగరేణిని ఇతర వ్యాపార రంగాల్లో అడుగు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో శక్తి వంచన లేకుండా కృషి చేశాను. ఫలితంగా నేడు సింగరేణి జాతీయ, అంతర్జాతీయ సంస్థగా ఎదుగుతోంది. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యావాదాలు" అని బలరామ్ భవిష్యత్‌లో సింగరేణి సంస్థ మరింతగా ఎదగాలని ఆకాంక్షించారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

- ఉద్యోగులకు భద్రత లేదు.. పెన్షనర్లకు భవిష్యత్ కరువు
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగుల హక్కులను హరిస్తున్నారని, పెన్షనర్ల ప్రయోజనాలు పట్టించుకోవడం లేదని.. హక్కుల సాధన కోసం పెన్షనర్లు ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాలుగో మహాసభ మంగళవారం మహబూబాబాద్ జిల్లాలోని గంగపుత్ర భవన్‌లో నల్ల లింగయ్య ప్రాంగణంలో జిల్లా అధ్యక్షులు దివిల వెంకటరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. పెన్షనర్లు ప్రశాంతంగా గడపలేని పరిస్థితి.. బయట తిరగలేని పరిస్థితి నెలకొందని అన్నారు. కార్మికులు, ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలు, హక్కులను ప్రధాని మోడీ విస్మరించారని అన్నారు. పెన్షనర్లకు కొత్త పిఆర్‌సి అవసరం లేదనే కొత్త సూత్రం చెబుతున్నారని విమర్శించారు. పైసాపైసా కూడబెట్టి కట్టిన జిఎస్‌టి పన్నులను రాయితీల రూపంలో ఆదాని, అంబానీకి, కార్పొరేట్ పెట్టుబడిదారీ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజల సౌకర్యాలను విస్మరించి ట్రంప్ ఆదేశాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా అవసరాలను పట్టించుకోకుండా ఉద్యోగులను, పెన్షనర్లను మానసిక వేదనకు గురిచేస్తున్నారని అన్నారు.

సౌకర్యం కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఉండగా.. ఆ పరిజ్ఞానం లేదని సీనియర్ ఉద్యోగులను తొలగించడం దుర్మార్గమన్నారు. దేశంలో గతంలో ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్ విధానంతో ఒక సంవత్సరం పనిచేసినా గ్రాట్యుటీ ఇస్తామని చెబుతూనే.. ఉద్యోగులను ఒకటి రెండేండ్లు పని చేయించుకుని ఇంటికి పంపించే విధానాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. మోడీ విధానాల మూలంగా దేశంలో ఉద్యోగులకు భద్రత లేదని, పెన్షనర్లకు భవిష్యత్ లేకుండా చేస్తున్నారని అన్నారు. దేశంలో కరోనా కాలంలో వైద్యం అందక మృతిచెందిన అనాధ శవాలకు అంతిమయాత్ర చేయలేని పరిస్థితి నెలకొందని, చైనా, క్యూబాలో ఆధునిక వైద్య పరిజ్ఞానంతో ఐదు గృహాలకు ఒక వైద్యుడిని నియమించి ప్రజలను కాపాడుకున్నారని గుర్తు చేశారు. ప్రధాని మోడీ ప్రపంచ బ్యాంకు విధానాలు, ట్రంప్ ఆదేశాలతో దేశాన్ని పరిపాలిస్తున్నారని విమర్శించారు.

వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నేటి సమాజంలో పెన్షనర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటన్నిటి సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దివిటి వెంకటరాజు, కాయిత వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ లింగ అరుణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి తూపురాని సీతారాం, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే యాకూబ్, ఆర్‌టిసి ఎడి సిఆర్ ముత్తయ్య, డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసర్ వెంటపల్లి సత్యనారాయణ, జిల్లా మాజీ అధ్యక్షులు మల్లయ్య, తొర్రూరు అధ్యక్షులు పి.రాజయ్య, ప్రముఖ కీళ్ల మార్పిడి వైద్యులు కంచర్ల సుధీర్, దార ముత్తయ్య పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయండి

- కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయండి
- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సిఎం వినతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సిఎం తెలిపారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. దేశంలో 19 రాష్ట్రాల్లో, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎం లు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించామని కేంద్ర మంత్రికి తెలిపారు. ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని, ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైన వసతులు కల్పనకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందని కేంద్ర మంత్రికి సిఎం తెలియజేశారు. హైదరాబాద్ లో ఐఐఎం ఏర్పాటు చేస్తే అది తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల అవకాశాలను మెరుగుపర్చుతుందని అన్నారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా తొమ్మిది కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు అవసరం ఉందని వివరించారు. కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మందాడి అనిల్ కుమార్, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పదేళ్లలో తెలంగాణలో 13 శాతం వృద్ధి

- బ్రిక్‌వర్క్ రేటింగ్స్ అంచనా

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం మెరుగైన వృద్ధి రేటును నమోదు చేస్తోందని బ్రిక్‌వర్క్ రేటింగ్స్ తెలిపింది. 2025 నుంచి 2034 మధ్య వార్షిక సగటు వృద్ధి 12-13 శాతంగా ఉండొచ్చని ఈ స్వదేశీ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ విశ్లేషించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రిక్‌వర్క్ రేటింగ్స్ సిఇఒ మను సెహగల్, చీఫ్ రేటింగ్ ఆఫీసర్ కెహెచ్ పట్నాయక్ మాట్లాడుతూ..పారిశ్రామిక రంగం, సేవల రంగం, మౌలిక సదుపాయాల్లో కొనసాగుతున్న పెట్టుబడుల వల్ల ఈ బలమైన వృద్ధి చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. అయితే ఈ వృద్ధి గమనాన్ని నిలబెట్టుకోవాలంటే నిరంతర విధాన మద్దతు, స్థిరమైన మూలధన ప్రవాహాలు, బాహ్య దేశీయ ప్రమాదాలను ఎదుర్కొనే దిశగా సకాలంలో నిర్మాణాత్మక సంస్కరణలు అవసరమన్నారు. ఆర్థిక సంవత్సరం 2024-25లో తెలంగాణ 8.1 శాతం వృద్ధితో.. దేశ జిడిపి సగటు 6.5 శాతాన్ని అధిగమించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. దేశంలో ఏడు రేటింగ్ ఏజెన్సీలు ఉన్నాయని.. అందులో తమది ఒక్కటన్నారు. ఈ సమావేశంలో ఆ సంస్థ డైరెక్టర్,రీసెర్చ్ హెడ్ రాజీవ్ శరన్, ఎపి, తెలంగాణ హెడ్ భాస్కర్ రెడ్డి జి.పాల్గొన్నారు.



బిక్‌వర్క్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌కు చెక్

- ముందుగా 'వంట మనుషులే తినేలా' ఆదేశాలు
- మంత్రి మహ్మద్ అజారుద్దీన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీ గురుకులాల్లో భవిష్యత్తులో ఫుడ్ పాయిజన్ కాకుండా కఠిన చర్యలు తీసుకోనున్నట్టు రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ మైనార్టీ గురుకులంలో చోటు చేసుకున్న ఫుడ్ పాయిజనింగ్ ఘటనను స్వల్పమైనదిగా అభివర్ణించిన ఆయన, ఇకముందు అలాంటివి కూడా జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తామని తెలిపారు. మైనార్టీ గురుకులాల్లో వంట మనుషులే, పిల్లలకు భోజనం పెట్టడానికి అరగంట ముందు అదే భోజనాన్ని తినేలా ఆదేశించినట్టు చెప్పారు. అంతే కాకుండా క్రమం తప్పకుండా ఆహార నాణ్యత తనిఖీలు, ఇతర చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మైనార్టీ గురుకులాల్లో కేవలం 40 మాత్రమే ఖాళీలున్నాయనీ, 7 వేల మందికిపైగా బోధన, బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారని చెప్పారు.

వక్ఫ్ ఆస్తుల నమోదుకు 3 నెలల గడువు

ఉమీద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల నమోదు కోసం వక్ఫ్ ట్రిబ్యునల్ మూడు నెలల గడువు పొడిగించినట్టు మంత్రి అజారుద్దీన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 63,180 వక్ఫ్ ఆస్తులను నమోదు చేయాల్సి ఉందని చెప్పారు. ఆస్తుల సంఖ్య ఎక్కువగా ఉండటం, వివరాలను సేకరించడం, పపరిశీలించడం, డిజిటలైజేషన్ కోసం ఈ పొడిగింపును కోరినట్టు తెలిపారు. గడువులోగా అన్ని ఆస్తుల వివరాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో పాటు తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాలయాల సంస్థ చైర్మెన్ మహమ్మద్ ఫహీం ఖురేషీ, హజ్ కమిటీ చైర్మెన్ హుస్సైనీ పాషా, మైనార్టీ సంక్షేమ శాఖ సీఈవో షఫీ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా శ్రీదేవసేన

హైదరాబాద్ బ్యూరో : స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా సాంకేతిక విద్యా కమిషనర్ శ్రీదేవసేనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఉన్న నవీన్ నికోలస్ సెలవులపై వెళ్తుండటంతో అప్పటి వరకు శ్రీదేవసేన బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

టెట్ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్ బ్యూరో : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్ విడుదలైంది. జనవరి 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. మొత్తం 9 రోజుల పాటు ప్రతి రోజు రెండు సెషన్స్‌లో ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల షెడ్యూల్‌కు సంబంధించి పూర్తి వివరాల కోసం స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 3న జరగాల్సిన ఇంటర్ సెకండ్ ఇయర్ మ్యాథమెటిక్స్-2ఎ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలను అదే నెల 4న నిర్వహించనున్నట్టు ఇంటర్మీడియట్ విద్యా బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 3న హోలీ పండుగ సెలవు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.



ఓటెయ్యకపోతే నా పైసలు ఇచ్చేయండి..!

- ఓడిపోయిన సర్పంచి అభ్యర్థి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ ఎన్నికల్లో ఓట్లు పొందేందుకు పల్లెల్లో నగదు పంపిణీ చేసి ఓటమిపాలైన అభ్యర్థులు మనస్తాపానికి గురై.. తమ నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ ఇంటింటికీ తిరుగుతూ వేడుకుంటున్నారు. నల్లగొండ జిల్లాలో మొదటి విడత ఎన్నికల్లో ఓడిపోయిన ఓ అభ్యర్థి డబ్బులు వసూలు చేసిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానే మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో అందరిలాగే స్వతంత్ర అభ్యర్థి డబ్బులు పంచినట్టు సమాచారం. కానీ ఎన్నికల్లో ఓడిపోయి మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దాంతో అతను మంగళవారం గ్రామంలో తిరుగుతూ తను ఇచ్చిన డబ్బులు ఇచ్చేయాలని కోరాడు. రెండో విడత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ స్థానానికి పోటీ చేసిన జంగపల్లి అంకుల్ ఘన విజయం సాధించగా, కత్తెర గుర్తుతో బరిలోకి దిగిన మరో అభ్యర్థి వాడగాడి శంకర్‌కు మూడో స్థానం దక్కింది. ఓట్ల కోసం డబ్బులు ఇచ్చినా.. తాము ఆశించిన విధంగా ఓటింగ్ జరగలేదని అతని అనుచరులు ఆరోపిస్తున్నారు. 'డబ్బులు తీసుకుని మాకు ఓటు వేయలేదు.. మా డబ్బులు మాకు ఇచ్చేయండి..'' అంటూ ఆ అభ్యర్థి కుటుంబ సభ్యులు గణపతి విగ్రహం, పసుపు, కుంకుమ, అక్షింతలు చేత పట్టుకుని ఇంటింటా తిరుగుతూ దండం పెడుతూ డబ్బులు అడగడం గమనార్హం.

బిఆర్‌ఎస్‌ఎల్‌పి, రాష్ట్ర కార్యవర్గ సమావేశం వాయిదా : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఈనెల 19వ తేదీన నిర్వహించాల్సిన బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం, బిఆర్‌ఎస్‌ఎల్‌పి సమావేశాన్ని ఈనెల 21వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు మాజీమంత్రి, ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19న పార్లమెంట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో బిఆర్‌ఎస్ పార్లమెంట్ సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొనడం కోసం 21వ తేదీకి

షాహి కార్మికుల పోరాటం స్ఫూర్తిదాయకం

- వారి సమ్మె న్యాయమైంది- మద్దతు పెంచుదాం
- సిఐటియు రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల నేతలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కష్టానికి తగ్గ జీతం ఇవ్వక పోతే తిరగబడతాం. తొమ్మిది రోజులుగా నిరవధికంగా కొనసాగుతున్న పోరాటాన్ని ఆపేది లేదు. జీతాలు పెంచే వరకు పోరాటాన్ని ఆపం' అంటూ నాచారంలోని షాహి ఎక్స్‌పోర్టు ప్రయివేట్ లిమిటెడ్(గార్మెంట్) పరిశ్రమ మహిళా కార్మికులు తెగేసి చెబుతున్నారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పోరాటం స్ఫూర్తిదాయమైంది. ఆ ఉద్యమానికి కార్మిక సంఘాల మద్దతును పెంచాల్సిన అవసరముందని' కార్మిక సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు.

సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్-ఎల్.పద్మ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి, రమ, కె.ఈశ్వర్‌రావు, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, కూరపాటి రమేష్, పి.శ్రీకాంత్, పి.సుధాకర్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఎఐయుటియుసి రాష్ట్ర నాయకులు భరత్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సోమన్న, ఐఎఫ్‌టియు నాయకులు శివబాబు పాల్గొన్నారు. షాహి కార్మికులకు రూ.16వేల వేతనం ఇవ్వాలని, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని, యాజమాన్యం వేధింపులు ఆపాలని, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని, ఒకరోజు సెలవు పెడితే రూ. ఎనిమిదొందలు కట్ చేసే పద్ధతిని ఆపాలని, బోనస్ 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ చుక్క రాములు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. షాహి పరిశ్రమలో 17 ఏండ్ల నుంచి పనిచేస్తున్న 16వందల మంది మహిళా కార్మికులకు వేతనాలు పెంచాలని తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా..కార్మిక శాఖ , యాజమాన్యం పట్టించుకోక పోవటం సరికాదని సంఘాల నాయకులు తప్పు బట్టారు. ఈ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు యాజమాన్యం శతవిధాలా ప్రయత్నించిందనీ, కార్మికులపై యాజమాన్యం దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వేతనాలు పెంచేలా చర్యలు తీసుకునేందుకు కార్మిక శాఖ అధికారులను ఆదేశించి, సమ్మెను నివారించాలని వారు కోరారు.

సమ్మెలో ఉన్న మహిళా కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తుందని, సమస్యను ప్రజాస్వామ్యయుతంగా పరిష్కరించకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని నాయకులు తెలిపారు. పనికి టార్గెట్లు విధిస్తున్నారని, పూర్తి చేయని కార్మికుల వేతనాల్లో కోతలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భోజన విరామ, విశ్రాంతి, మూత్రశాలలకు వెళ్ళే సమయాన్ని కూడా కుదిస్తూ అరాచకంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. జీతాలు పెంచాలని కోరుతున్న మహిళా కార్మికులను తొలగిస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. వీరికి నామమాత్రంగా రూ.తొమ్మిది వేల నుంచి రూ.11,200ల వరకు మాత్రమే వేతనం చెల్లించటం అన్యాయమని విమర్శించారు. ఒకరోజు సెలవు పెడితే వేతనం నుంచి రూ.ఏడు నుంచి, రూ. ఎనిమిదొందల వరకు కట్ చేస్తున్నారని తెలిపారు. శనివారం సెలవు పెడితే.. ఆదివారాలకు కలిపి రెండు రోజుల వేతనం కట్ చేస్తున్నారని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ఏర్పాటు చేయాల్సిన క్యాంటీన్ కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు పరిశ్రమను సందర్శించి తనిఖీలు చేసి కార్మిక చట్టాలు అమలు జరిపే విధంగా తగిన ఆదేశాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

జెసిఎల్ వద్ద చర్చలు..

రౌండ్ టేబుల్ అనంతరం కార్మిక నాయకులు లేబర్ కమిషనర్ వద్దకు వెళ్లి జెసిఎల్ సమక్షంలో మంగళవారం షాహి ఎక్స్‌పోర్ట్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యానికి కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులకు మధ్య చర్చలు జరిగాయి. కాగా ఆ చర్చలు బుధవారానికి వాయిదా పడ్డాయి.

రూ.10తోనూ ఎంఎఫ్‌ల్లో పెట్టుబడి

- ఫోన్ పే వెల్త్ వెల్లడి

ముంబయి : మ్యూచువల్ ఫండ్స్ 'డైలీ ఎస్‌ఐపి' ఫీచర్‌ను ప్రారంభించినట్లు ఫోన్‌పే వెల్త్ ప్రకటించింది. దీని ద్వారా వినియోగదారులు తమ ఫోన్‌పే యాప్ ద్వారా ప్రతి రోజు కేవలం రూ.10 కూడా నేరుగా పెట్టుబడి పెట్టడానికి వీలుంటుందని పేర్కొంది. ఈ సౌకర్యం భవిష్యత్ పెట్టుబడిదారులకు తమ రోజువారీ పొదుపును సులభంగా పెట్టుబడిగా మార్చుకోడానికి సహాయపడుతుందని ఆ సంస్థ పేర్కొంది. దీనిని ఫోన్‌పే యాప్‌లో ఆటోపే ద్వారా తక్షణమే ప్రారంభించుకోవచ్చని ఫోన్‌పే వెల్త్ ప్రోడక్ట్స్ హెడ్ నీలేష్ డి నాయక్ తెలిపారు. ఇది దీర్ఘకాలిక సంపద సృష్టించడంలో సహాయపడుతుందన్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పు సప్పు చేసి పనులు నిర్వహిస్తే.. రెండురేండ్లు గడిచినా డబ్బులు రాకపోవడంతో కాంట్రాక్టర్ ఆవేదనకు గురై బడికి తాళం వేశాడు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని పోసానిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మన ఊరు మనబడి కింద భవనం మంజూరైంది. అందుకు రూ.80 లక్షల నిధులకు ప్రభుత్వం ప్రొసీడింగ్ ఇచ్చింది. అదే గ్రామానికి చెందిన లింబారెడ్డి జులై 2023లో పనులు ప్రారంభించాడు. రూ.40 లక్షలతో పనులు పూర్తిచేసి 2 సంవత్సరాల 6 నెలలు అవుతున్నా ఒక్క రూపాయీ మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం పాఠశాల భవనానికి తాళం వేసి నిరసన తెలిపాడు. ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారి రాజును 'నవతెలంగాణ' వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

సిపిఎం నుంచి నరసింహులు, పోశెట్టి బహిష్కరణ

- జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.జహంగీర్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొంత కాలంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ.. క్రమశిక్షణను ఉల్లంఘించిన ఆలేరు మండల నాయకులు మంగ నర్సింహులు, బబ్బురి పోశెట్టిని సిపిఎం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ అధ్యక్షతన జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. సిపిఎం నుంచి బహిష్కరణకు గురైన నరసింహులు, పోశెట్టికి ఇకపై పార్టీతో ఎలాంటి సంబంధమూ లేదని అన్నారు. ప్రతి సభ్యుడూ పార్టీ నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. పార్టీ నియమాలను ఎవరు అతిక్రమించినా క్రమశిక్షణా చర్యకు గురవుతారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని స్కీమ్‌గా మార్చడం దుర్మార్గం

- లక్షలాది మంది ఉపాధికి దూరమయ్యే ప్రమాదం
- తెలంగాణ గిరిజన సంఘం ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తెలంగాణ గిరిజన సంఘం విమర్శించింది. దీంతో రాష్ట్రంలో లక్షలాదిమంది గిరిజనులు ఉపాధికి దూరమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మ నాయక్, ఆర్.శ్రీరాం నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్-2025 పేరుతో నూతన బిల్లును పార్లమెంటులో ఆమోదం కోసం ప్రవేశ పెట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఉపాధి కరువై గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, దళితులు వామపక్షాలు, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అప్పటి యుపిఎ ప్రభుత్వంపై పోరాడి 2005లో ఈ చట్టాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు.

ఉపాధి హామీ చట్టం కోట్లాది మంది జీవన ప్రమాణాలు పెంచేందుకు ఎంతగానో దోహదం చేసిందని అన్నారు. రాష్ట్రంలో గిరిజన గూడాలు, తండాల్లో పనులు లేక సుదూర రాష్ట్రాలకు వలసలు వెళ్లే దుస్థితిని ఉపాధి హామీ చట్టం కొంతవరకు నివారించగలిగిందని తెలిపారు. ఈ చట్టాన్ని విస్తరించి పట్టణాల్లో అమలు చేయాల్సిన అసరముండగా గ్రామాల్లోనూ తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉపాధి పనులు చూపాలనే ఉద్దేశంతో పథకంలో మార్పులు చేయడం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ భూస్వామ్య మనువాద భావజాలానికి నిదర్శనమని వారు ఆరోపించారు. ఇప్పటి వరకు 100 శాతం నిధులిస్తున్న కేంద్రం 60 శాతమే ఇస్తామనీ, మిగిలిన 60 శాతం రాష్ట్రాలు భరించాలే ఆ మార్పులు చేయడం చట్టం లక్ష్యాన్ని కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ కార్డుల హేతుబద్ధీకరణ పేరుతో ప్రస్తుతం ఉపాధి పొందుతున్న కోట్లాది మంది కార్డులను తొలగించేలా కొత్త నిబంధనను చేర్చిందని విమర్శించారు. వ్యవసాయ పనులు జరిగే 60 రోజులు ఉపాధి నిలిపి వేయాలనుకోవడం కేవలం భూస్వాములు, ధనిక రైతులపై ఆధారపడేలా చేసేందుకేనని అభ్యంతరం వ్యక్తం చేశారు. నూతన ఉపాధి పథకాన్ని వ్యతిరేకించాలనీ, ఉపాధికి గ్యారెంటీ ఇచ్చే పాత చట్టాన్ని అమలు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రజాస్వామ్యవాదులు, గిరిజన, ప్రజా సంఘాలు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

మీ పాలనలోనే యూరియా కొరత?

- కాంగ్రెస్‌పై మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసలు రైతులకు శిక్ష, కౌలు రైతులపై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టిందని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే యూరియా కొరత ఎందుకొస్తుందని మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. టెనెన్సీ యాక్ట్ ప్రకారం ఇది అసలు రైతులు, కౌలు రైతుల మధ్య చిచ్చుపెట్టేలా ఉందని పేర్కొన్నారు. ఈ చర్య సాగును తగ్గించే కుట్రలా కనిపిస్తోందని తెలిపారు. ఇంటి నుండే యూరియా బుకింగ్ అనే నిర్ణయం కూడా అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. దళారులు రైతుల పేర్ల మీద యూరియా బుక్ చేసే అవకాశం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిరక్షరాస్యులైన రైతులు, స్మార్ట్ ఫోన్ వాడని వారికి ఈ నిర్ణయంతో ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నెట్‌వర్క్ లేని చోట ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించకుండా సర్కారు పిల్లిమొగ్గలు వేస్తోందని పేర్కొన్నారు. మొదట కొన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలుచేయకుండా మొత్తం రాష్ట్రంలో అమలు చేయాలనుకోవడం అనాలోచిత చర్య అని విమర్శించారు. యూరియా కోసం యాప్ తేవడాన్ని ఆయన ఖండించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా అన్నారనీ, దాన్ని రూ.12 వేలకు కుదించి నాలుగు సార్లు ఎగ్గొట్టారని తెలిపారు. కౌలు రైతులకూ రైతుభరోసా అని చెప్పి మొండిచేయి చూపించారని పేర్కొన్నారు.

'మీ సేవా వాట్సాప్' సేవకు భారీ స్పందన

- 22 రోజుల్లో 2.7 లక్షలసార్లు వినియోగం
- మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ డిజిటల్ సేవల వేదిక మీ సేవా కింద ప్రారంభించిన వాట్సాప్/చాట్‌బాట్ సేవకు భారీ స్పందన వస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు 22 రోజుల్లోనే 2.7 లక్షలసార్లు వినియోగించారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 18న మీ సేవా కింద అదనపు డిజిటల్ చానల్‌గా ఈ సేవను ప్రభుత్వం ప్రారంభించిందని పేర్కొన్నారు. ఈ సేవ ద్వారా ప్రజలు ఇకపై మీ సేవా కేంద్రాలకు వెళ్లకుండానే ప్రభుత్వ సేవలు పొందగలుగుతున్నారని వివరించారు. ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేయొచ్చని సూచించారు. బిల్లుల వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుల స్థితిని పరిశీలించొచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదులు కూడా నమోదు చేయొచ్చని తెలిపారు. ఈ సేవ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించామని వివరించారు. ప్రజల కేంద్రిత డిజిటల్ పరిపాలనను మరింత విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం వెల్లడించిన గణాంకాల ప్రకారం, గతనెల 18 నుంచి ఈనెల తొమ్మిది వరకు మీ సేవా వాట్సాప్ సేవను ప్రజలు మొత్తం 2,78,267 సార్లు వినియోగించారని వివరించారు. ఈ కాలంలో 2,09,084 వేర్వేరు మొబైల్ నెంబర్ల నుంచి ప్రజలు ఈ సేవను ఉపయోగించినట్టు అధికారులు ప్రకటించారని తెలిపారు. 75,655 దరఖాస్తు ఫారాలు సమర్పించబడ్డాయని పేర్కొన్నారు. వాటిలో 1,403 మాత్రమే నిజమైన దరఖాస్తులు కాగా, మిగిలిన సేవల గురించి తెలుసుకునేందుకు లేదా విధానాన్ని అర్థం చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలు చేసినట్టు అధికారులు వివరించారని పేర్కొన్నారు. 45,829 సార్లు దరఖాస్తుల స్థితి పరిశీలించబడిందని తెలిపారు. మొత్తం విజయ శాతం 81.3 శాతంగా నమోదైందని వివరించారు. ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్న సేవల్లో జనన ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, పోలీస్ చలాన్లు, విద్యుత్ బిల్లుల సేవలున్నాయని పేర్కొన్నారు. రోజువారీ పరిపాలనా అవసరాలకు వాట్సాప్ ఒక సులభమైన, నమ్మదగిన వేదికగా మారుతోందని తెలిపారు. భవిష్యత్తులోనూ మీ సేవా ద్వారా మరిన్ని డిజిటల్ సేవలను అందుబాటులోకి తెస్తామని వివరించారు. వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తామనీ, ప్రజలకు సులభంగా, నిరంతరాయంగా సేవలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.



'షాహి గార్మెంట్' మహిళలకు కనీస వేతనం రూ.15 వేలివ్వాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

షాహి గార్మెంట్ కంపెనీలో పని చేస్తున్న మహిళలకు కనీస వేతనం రూ.15వేలివ్వాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాచారం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న షాహి గార్మెంట్ కంపెనీలో పని చేస్తున్న మహిళలు తమకు కనీస వేతనం రూ.15వేలకు పెంచాలని తొమ్మిది రోజులుగా కంపెనీ ఎదుట కూర్చుని నిరసన తెలియజేస్తున్నారు. ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎం.సృజన, ఎం.వినోదతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మంగళవారం వారికి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 9 రోజులుగా మహిళలు కనీస వేతనం కోసం సమ్మె చేస్తుంటే కంపెనీ యాజమాన్యానికి చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. కంపెనీలో పని చేస్తున్న మహిళలను సూపర్‌వైజర్లు వేధించడం, వాష్ రూంకి వెళ్తే తిట్టడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. మహిళలు పని చేస్తున్న కంపెనీలో లైంగిక వేధింపుల కమిటీ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.15వేలివ్వాలని డిమాండ్ చేశారు.

'అగర్వాల్' పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

- యాజమాన్యంపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి
- కార్మికుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని
- సిపిఎం నేతల డిమాండ్.. పరిశ్రమలో పరిశీలన



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెస్ అగర్వాల్ ఫౌండరీస్ స్టీల్ పరిశ్రమలో రక్షణ చర్యలు పాటించకపోవడంతోనే తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు మృతి చెందుతున్నారని, అందుకు కారకులైన యాజమాన్యంపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిపిఎం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా మనోరాబాద్ మండలం రంగయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎమ్మెస్ అగర్వాల్ ఫౌండ్రీస్‌లో సోమవారం జరిగిన ప్రమాద ఘటనపై మంగళవారం సిపిఎం నేతలు పరిశ్రమను సందర్శించారు. కార్మికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య మాట్లాడుతూ.. తక్షణమే ప్రమాద ఘటనపై ప్రభుత్వం, అధికారులు స్పందించి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కార్మికుల కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలో ప్రమాదంలో కార్మికుడు మృతి చెందినా యాజమాన్యం సరిగా స్పందించలేదన్నారు. ప్రమాదాలు జరగకుండా ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత రక్షణ పరికరాలు వాడాల్సి ఉన్నా ఎందుకు ఉపయోగించలేదని ప్రశ్నించారు. బాయిలర్ దగ్గర అత్యవసర అలారం పెట్టలేదని, సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేయాలని నిబంధనలు ఉన్నా యాజమాన్యం అమలు చేయలేదని అన్నారు. ఎమ్మెస్ అగర్వాల్ యాజమాన్యం కార్మికుల భద్రత కంటే లాభాలకే ప్రాధాన్యత ఇస్తోందని ప్రమాద స్థలాన్ని బట్టి అర్థం అవుతుందని అన్నారు. పని ప్రదేశంలో కార్మికులకు హెల్మెట్, గ్లోవ్స్, మాస్క్ వంటివి అందించి అవి సరిగా పనిచేస్తున్నాయా లేదా అని నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నిబంధనలు పాటించకుండా కార్మికుల జీవితాలతో పరిశ్రమ యాజమాన్యం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అగర్వాల్ పరిశ్రమలో రెండు నెలల కిందట కూడా ఓ కార్మికుడు చనిపోయారని తెలిపారు. వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ప్రమాదంలో గాయపడిన కార్మికుల వైద్యానికి అయ్యే ఖర్చులను పరిశ్రమ యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన కార్మికుని కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్మిక శాఖ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అగ్నిమాపక శాఖలు కార్మికుల కోసం కాకుండా పరిశ్రమ యజమానుల వైపు ఉంటున్నాయని ఆరోపించారు. ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమతోపాటు జిల్లాలోని మిగతా పరిశ్రమల్లో నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై జిల్లా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ.మల్లేశం, ఏ.మహేందర్ రెడ్డి, తూప్రాన్ ఏరియా కమిటీ నాయకులు ఆసిఫ్, రాజు తదితరులు ఉన్నారు.



మాక్సి విజన్‌లో వైడ్‌ఫీల్డ్ రెటీనా ఇమేజింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్

మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ సోమాజిగూడలోని తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ది వైడ్‌ఫీల్డ్ ఫండస్ కెమెరాగా ప్రాచుర్యం పొందిన అధునాతన వైడ్‌ఫీల్డ్ ఫండస్ ఇమేజింగ్ సిస్టమ్‌ను పరిచయం చేసినట్లు తెలిపింది. దీని ద్వారా రెటీనా డయాగ్నస్టిక్స్‌లో అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్లయ్యిందను మాక్సివిజన్ వ్యవస్థాపకుడ, సహ ఛైర్మన్ డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఇది సాధారణ ఫండస్ కెమెరాల కంటే చాలా మెరుగైన ఫలితాలను అందిస్తుందన్నారు. సాంప్రదాయ ఇమేజింగ్ వల్ల సాధారణంగా వైద్యులు తరచుగా కనుగొనలేని ప్రారంభ దశ గాయాలు, క్షీణతలు, నాళ సంబంధిత మార్పులను గుర్తించడానికి వీలు కల్పిస్తుందన్నారు. తమ సోమాజిగూడ కేంద్రం ఎల్లప్పుడూ ఆవిష్కరణల పరంగా తమకు కేంద్రంగా ఉందన్నారు. ఈ టెక్నాలజీ డైలేషన్ లేకుండా వైడ్‌ఫీల్డ్ చిత్రాలను తీయగల సామర్థ్యం రోగులను వేగంగా, సమగ్రంగా పరీక్షించడంలో మాకు సహాయపడుతుందన్నారు

కనుమరుగవుతున్న ధాన్యం గుమ్ములు

- నిల్వలు గోదాములకే పరిమితం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ప్రధాన ధాన్యం నిల్వ కేంద్రాలుగా వెలుగొందిన 'గుమ్ములు' (ధాన్యం భాండాగారాలు) నేడు పూర్తిగా కనుమరుగైపోతున్నాయి. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మార్కెటింగ్ సౌకర్యాలు పెరగడం, ప్రభుత్వ గోదాంల విస్తరణ కారణంగా సంప్రదాయ గుమ్ములు ప్రాధాన్యతను కోల్పోతున్నాయి. పూర్వకాలంలో రైతులు పండించిన పంటలను ఎక్కువ కాలం భద్రపరుచుకోవడానికి 'గుమ్ములు' వాడేవారు. వీటిని వెదురు, పులిచేరు, కొడిసె కర్రలతో తయారు చేసి మట్టి, పేడతో అద్దేవారు. వీటితోపాటు పశువుల పేడ తీసేందుకు తట్టలు, కోళ్లను కమ్మేసేందుకు గంపలను సైతం తయారు చేసేవారు. వీటిని ఎరుకల, మేదర సామాజిక తరగతికి చెందినవారు తయారు చేసేవారు.

చిన్న సన్నకారు రైతులు, మోతుబరి రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకోవడం కోసం పుట్టెడు, రెండు పుట్లు, మూడు పుట్లు పట్టే విధంగా గుమ్ములు తయారు చేయించుకునేవారు. ఇవి కేవలం ధాన్యాన్ని నిల్వ చేయడమే కాక, రైతు కుటుంబాలకు ఒక ఆర్థిక భరోసాగా ఉండేవి. గుమ్ముల్లో ఎక్కువగా ధాన్యాన్ని నిల్వ ఉంచే రైతులను ధనిక రైతుగా చూసేవారు.

గోదాముల్లో ధాన్యం

ప్రస్తుత కాలంలో పంట పండిన వెంటనే రైతులు ఎక్కువ శాతం ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోదాంలు, కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. దీంతో గ్రామాలలో ధాన్యం నిల్వలు ఉండాల్సిన గుమ్ములు ఖాళీగా ఉండి, శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

నిల్వలో మార్పులు

ధాన్యం నిల్వ ప్రక్రియ ఇప్పుడు కేవలం గోదాంలకే పరిమితమైంది. ఇక్కడ ఆధునిక పద్ధతులు, కీటకాల నివారణ చర్యలు, పక్కా భద్రతా ఏర్పాట్లు ఉండటం వల్ల రైతులు, వ్యాపారులు ఈ విధానాన్ని ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. మొత్తం మీద, ఒకప్పటి గ్రామ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన సంప్రదాయ ధాన్యం భాండాగారాలు (గుమ్ములు) చరిత్ర పుటలకే పరిమితం కాగా, గోడౌన్ల ద్వారా ధాన్యం నిల్వ పద్ధతి పూర్తి ఆధునికత సంతరించుకుంది.

సంపన్న కస్టమర్ల కోసం ఉజ్జీవన్ ఎస్‌ఎఫ్‌బి 'ఐవరీ ప్రోగ్రాం'

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

తమ సంపన్న కస్టమర్ల కోసం ఐవరీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. ఇందులో మెరుగైన లావాదేవీ సామర్థ్యాలు, గ్లోబల్ యాక్సెస్, కీలకమైన బ్యాంకింగ్ లావాదేవీలు, సేవలపై జీరో ఫీజు బ్యాంకింగ్‌ను అందిస్తున్నట్లు పేర్కొంది. ఐవరీ ప్రోగ్రాంలోని ఖాతాదారులకు ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని 350కు పైగా ప్రీమియం మారియట్ ప్రాపర్టీలలో భోజన, బస ప్రయోజనాలకు ప్రత్యేక యాక్సెస్ ఉంటుందని ఆ బ్యాంక్ రిటైల్ లయబిలిటీస్ హెడ్ హితేంద్ర ఝా తెలిపారు. ఈ సభ్యత్వంలో విమానాశ్రయ లాంజ్ యాక్సెస్, ప్రపంచవ్యాప్త ఆమోదం, మెరుగైన లావాదేవీ పరిమితులతో కూడిన ప్రీమియం మెటల్ డెబిట్ కార్డ్ ఉంటుందన్నారు.

నగరంలో ఎహెచ్‌పిఐ షైన్ ల్యాబ్స్

- ఆస్పత్రి సిబ్బంది శిక్షణ కోసం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



దేశంలోని ఆరోగ్య రంగ మానవ వనరుల బలోపేతానికి కీలకమైన అడుగుగా ఎబెక్‌మెడ్ సంస్థ, అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆఫ్ ఇండియా (ఎహెచ్‌పిఐ) సహకారంతో మంగళవారం హైదరాబాద్‌లోని పంజాగుట్టలో ఎహెచ్‌పిఐ షైన్ ల్యాబ్స్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఎహెచ్‌పిఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిర్దర్ జ్ఞానీ, పివిఆర్‌ఐ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్ ఛైర్మన్ ఆర్ గోవింద్ హరి, కాంటినెంటల్ హాస్పిటల్స్ ఎండి రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఇది ఆసుపత్రుల సిబ్బంది శిక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి స్వతంత్ర కో స్కిల్ హబ్ అని గిర్దర్ జ్ఞానీ తెలిపారు.